





ఎస్. వేణుగోపాల్

"రాధీ!.... రాధీ!...."

"వస్తున్నా." లోపలినుంచి జవాబు.

రెండు, మూడు క్షణాల తరువాత తలుపు తెరవబడింది.

నేను వుస్సూరుమంటూ లోపలికి అడుగుపెట్టాను.

నన్నుచూసి ఓ క్షణం నివ్వెరపోయింది రాధ.

"ఏమిటండీ యిది? స్నానంగాని చేసి వచ్చారా ఏం?"

"అట్లాగే అనుకో" అన్నాను. ఒకవైపు చీదర. తలుపు మూసుందిగనుక వీలయితే క్షణాలమీద గుడ్డలన్నీ లాగిపారేసి, కాసేపు తృప్తిదీరా ఏ ఫ్యాన్ కిందనో కూచోవాలన్న మనస్సులోని కోరిక. గబగబా గుడ్డలు మార్చుకున్నాను. లుంగీ చుట్టుకుని ధారలుగా కారుతున్న చెమటను తుడుచుకోవడం మొదలుపెట్టాను.

ఇంతలోకే "మంచి నీళ్ళేమైనా కావాలా?" అంటూ వచ్చింది రాధ.

"వద్దులే" అన్నాను.

రాధ కొద్దిగా గోడవైపుకు జరిగి, కూర్చుండిపోయింది.

"అబ్బబ్బ! ప్రాణాలు పోతున్నాయండి. మధ్యాహ్నం పొద్దు అట్టుడికినట్టే అవుతోంది. అయినా యివెక్కడి ఎండలండి బాబు!"

"చూస్తున్నావుగా. నిన్నటి పేపరోనేగా వేశారు. పదకొండు సంవత్సరాలకోసారి యిట్లాగా వుంటుందని. సూర్యుడిలో ఈ సంవత్సరం అవేవో నల్లటి మచ్చలు ఎక్కువగా వున్నాయట! దాని ప్రభావమే యిదని రాశారు."

"ఏం రాతలో ఏమో బాబు. యీ ఎండలు పాడుగాను. త్వరగా యీ మే నెలన్నా వెళ్ళిపోతే బావుణ్ణు. ఆ తరువాత వుడికిపోవడాలు అది చచ్చినా వుండదు. హాయిగా ఏ పనన్నా చేసుకోవచ్చు. చీదర వుండదు. ఏ పని చేద్దామన్నా చెయ్యాడదు కాలాడదుకదా. శరీరమంతా అలసిపోయినట్లయిపోయి నీరసం ముంచుకొస్తుంది. అయినా, యీ పాడు ఎండలు ఎందుకుట? ఎవర్ని బాగుచెయ్యాను? ఆ దేవుడికి కూడా మనుషుల్ని సతాయించడమంటే యిష్టం కాబోలు. లేకపోతే, రాఘురామ యీ పాడు ఎండలు ఎక్కడివండీ? యింతకు ముందెప్పుడూ చూసెరగను. ఆ వర్షాలొచ్చేవరకు ఏ వూటీకో పారిపోతే బావుణ్ణనిపిస్తుంది.... వు... సర్లెండి. దీనికి అంతువుండదు, పొంతువుండదు. టీ, కాఫీ ఏమయినా పెట్టుకుని రానా? యింకాస్సేపు కానీనా?"

దండకం ఆగాలంటే ఏదో పనిలో పడాలి అదొక్కటే మందు.

"వెళ్ళి చేసుకురాపో" అంటూ వంటింట్లోకి తరిమేశాను రాధను.

* * *

ఒకటే వర్షం.

కుండపోతగా కురుస్తోంది. మరోవైపు గడియారంలో పెద్దముల్లు, చిన్నముల్లు మరేంపని లేనట్లు అదే పనిగా పరుగులు పెడుతూనే వున్నాయి. ఆఫీసు వదిలినా, కదలలేని స్థితి.

ఏమయితే అదయిందని పరుగులెత్తి యిల్లు చేరాను. గుడ్డలు పూర్తిగా తడిసిపోయాయి. తలమీదినుంచి నీళ్ళు గంగానది ప్రవహించినట్లు ప్రవహిస్తున్నాయి. గుడ్డల్లోని నీళ్ళు పిండితేగాని ఆరవేసేలా లేవు.

తడి గుడ్డలు విప్పేసి, పొడి గుడ్డలు కట్టుకుంటేగాని ప్రాణం కుదుటపడదు.

రాధ తడిసిపోయిన షర్టును, ప్యాంటును వరండావైపు తీసుకుని వెళ్ళి పిండేసి తీసుకుని వచ్చింది. "అబ్బబ్బ! ఒకటే వాన. ఆగి చస్తేనా? మీరు ఎట్లా వస్తారా, ఏమిటా అనుకుంటున్నాను. యింతలోకే వచ్చేశారు. అయినా ఎట్లా వచ్చారు? నడిచి మాత్రం రాలేదు కద?" అంటూ.

"అబ్బబ్బ! లేదులేవే. యింటిదాకా బస్సుల్లోనే వచ్చాను" అంటూ సర్దేశాను.

"వుండండి టీ అయినా చేసి తీసుకొచ్చేస్తాను" అంటూ వంటింట్లోకి దారి తీసింది రాధ.

లోపల్నుంచి టీ రాలేదుగాని, మాటలు మాత్రం వస్తున్నాయి. అవతల పక్కింటి పిన్నిగారు కిటికీ తెరిచినట్టున్నారు.

"ఏమ్మా! అల్లుడుగారు వచ్చేశారా?"

"వచ్చేశారు పిన్నిగారు. అయినా ఏం పాడు వానలో ఏమో! చచ్చినా ఆగి చావవుకదా. యిట్లా వర్షం విడవకుండా పడుతోంటే, ఏ పనిమాత్రం సవ్యంగా చేసుకోగలం? వర్షం ఆగింది అంటేచాలు మళ్ళీ చాకిరీ. లోపలికి పడిన నీరంతా గుడ్డపెట్టి సుబ్బరంగా తుడిచేసుకోవాలి. ఈ వంటింటి కిటికీ తెరిచి మీతో కాస్సేపు మాట్లాడదామంటే కుదరదుకద. చిన్నవాన పడినా చాలు వర్షమంతా వంటింట్లోకే చేరిపోతుంది. ఏం వానలో ఏమో? ఈ వాన ఇప్పట్లో ఆగిపోయేలా లేదు. రేడియోలో చెప్పారివ్వాళ విన్నారుకద. వచ్చేవారం వర్షాలింకా ఎక్కువయ్యే సూచనలున్నాయట! వర్షాలుపడితే పంటలకేమైనా మేలేమోగాని, మనలాంటివాళ్ళకుమాత్రం మహా యిబ్బందనుకోండి...."

వచ్చే ఋతువు కోసం ఎదురుచూడడంలోని ఆనందమిలాగే వుంటుందికాబోలు.

ఆపకపోతే ఈ ప్రసంగం అట్లానే వానతోపాటు సాగుతూనే వుంటుంది.

"రాధీ.... ఓ రాధీ!"

"ఆ, వచ్చే! వచ్చే!.... మీ అల్లుడుగారు పిలుస్తున్నారు పిన్నిగారు. కాస్త టీ యిచ్చేసొస్తాను."

"వెళ్ళమ్మ, వెళ్ళు" అవతలి కిటికీ మూసిన చప్పుడు.

ఓ క్షణం నిశ్శబ్దం.

ఇవతల కిటికీ మూసిన చప్పుడు.

అమ్మయ్య! బయటి సంగతేమిటోగాని యింట్లో మాత్రం వర్షం వెలిసింది.